# ఫేస్ వేల్యూ

ధనంజయరావు గొప్పదాత. ధార్మికుడు. తన సహాయం కోరివచ్చినవారినెప్పుడూ నిరుత్సాహపర్చలేదు. ఎవ్వరికీ లేదనకూడదనే పాలసీ అతనిది. ధనంజయరావుకు పెద్ద బట్టల షాపువుంది. అందులో అన్నిరకాల వస్త్రాలు, రెడీమేడ్ డ్రస్సులు హోల్‌సేల్ గానూ, రీటేల్‌గానూ అమ్ముతాడు.

ధనంజయ రావు కస్టమర్స్‌ని ఆకర్షించడంలోనూ, షాప్‌కి వచ్చిన వారిని మర్యాదచేసి వారి గుడ్‌విల్ సంపాదించడంలోనూ దిట్ట. ఆ విధంగా అతనికి ఊర్లో అన్నివర్గాల ప్రజలతోనూ అనుబంధమేర్పడింది.

అయితే ధనంజయరావుకు ప్రజల్లో సంపాదించిన పరపతి, అభిమానం, గుడ్‌విల్ అతని బిజినెస్ అభివృద్ధికి తోడ్పడినా ఇంకో విధంగా అతణ్ణిఎంతో ఇబ్బంది పెట్టింది.

ఊర్లో ఎన్నో యువజనసంఘాలూ, సేవా సమాజాలూ ఉన్నాయి. లయన్స్ క్లబ్, రోటరీ, వాకర్స్ క్లబ్బులున్నాయి. అరడజను సాహితీ సంస్థలు, నాలుగు నాటకసమాజాలు ఉన్నాయి. ఇవిగాక బాబాభక్తమండలి, గణపతి భక్తమండలి, దేవీనవరాత్రి ఉత్సవ కమిటీలున్నాయి. వాట్లలో మెంబరుగా చేరమని వారి కార్యక్రమాలకు విరాళాలు ఇవ్వమని ధనంజయరావును బలవంతం చేయసాగేరు. ధనంజయరావు గొప్ప లౌక్యుడు. అయితే వచ్చిన ప్రతివారికీ వందలూ వేలూ విరాళాలు ఇస్తే ఇంకేమైనా ఉందా! అందుచేత వచ్చినవారికి తను ఇచ్చే డొనేషన్ ఐదు లేక పదిరూపాయలు మించకుండా నియమం పెట్టుకుని తన నియమభంగం వాటిల్లకుండా ఎంతో నేర్పుతో నెట్టుకొస్తున్నాడు. అది అతని ప్రత్యేకత.

స్టేట్‌బాంక్ ఫీల్డాఫీసరుగా వచ్చిన మురళీకృష్ణ మంచి ఉత్సాహవంతుడు, ఎంతో చురుకైన వ్యక్తి. "ఫేస్ వాల్యూ ఉంటే ఏపని చేసినా రాణిస్తుంది" అంటాడు. ఫేస్ వాల్యూ ఉన్న హీరో, హీరోయిన్లను బుక్‌చేసి ఎటువంటి పిక్చరు తీసినా నిర్మాతలు డబ్బు

చేసుకుంటున్నారు. ఫేస్ వాల్యూతో సాధించలేనిదేదీ లేదంటూ గంటల కొలదీ అనర్గళంగా ఉపన్యాసమివ్వగలడు మురళీకృష్ణ.

మురళీకృష్ణ ఉత్సాహం నేర్పరితనం, తెల్సుకుని ఒక ఆధ్యాత్మిక సంస్థ స్వర్ణోత్సవాలకు కార్యదర్శిగా నియమించేరు. కార్యక్రమానికి డొనేషన్స్ సంపాదించడంలో తన ఫేస్ వాల్యూ తెలిసేలా చెయ్యాలనుకున్నాడు.

ధనంజయరావు ఊర్లో పెద్ద బిజినెస్‌మేన్. గొప్పదాత అని పేరుపొంది ఎవరికీ ఇంతవరకూ పదిరూపాయలకంటే ఎక్కువ విరాళం ఇవ్వలేదని తెల్సుకున్నాడు. అటువంటివాడి వద్దనుండి తను కనీసం వెయ్యిన్నూటపదహార్లు డొనేషను వసూలు చేసి తన ఫేస్ వాల్యూ అందిరికీ తెలియజేయాలనుకున్నాడు.

మురళీకృష్ణ ధనంజయరావును కల్సుకుని సంస్థ స్వర్ణోత్సవ కార్యక్రమాల గురించిచెప్పాడు. ఆ సందర్భంలో ఊళ్లో మంచి వ్యాపారవేత్తగా, గొప్ప ధార్మికునిగా పేరుపొందిన మిమ్మల్ని మా సంస్థ సన్మానించదలచింది. మీరు అనుమతిస్తే కరపత్రాలు ప్రింట్ చేయాలి" అన్నాడు.

మురళీకృష్ణ ప్రపోజల్‌కి ధననంజయరావు ఎంతో ఆశ్చర్యపడి "అఁ ఎందుకండీ ఇప్పుడీ అనవసర ఖర్చు, ఆర్భాటం...ఆ డబ్బు మరో మంచిపనికి ఉపయోగించవచ్చు కదా!" అన్నాడు మొహమాటంగా.

"మీరలా అనడమే మీ గొప్పతనానికి తార్కాణం. మీలాంటి ధార్మికుల్ని సన్మానించడం కంటే మంచిపని మరొకటి లేదు" అని ధనంజయరావును సన్మానానికి ఒప్పించేడు మురళీకృష్ణ.

"మా సంస్థకు తమరు ఇవ్వబోవు విరాళం సన్మానసభలో వేదిక మీద ప్రకటించి ఇవ్వమని మా కోరిక" అన్నాడు లౌక్యంగా .

స్వర్ణోత్సవ సభకు ఊర్లో ప్రముఖులు, ప్రజలు చాలామంది వచ్చేరు.

ధనంజయరావు గొప్ప వ్యాపారవేత్తగా, ధార్మికుడిగా, ఊర్లో జరిగే ప్రతికార్యాక్రమానికీ విశాల హృదయంతో విరాళమందిస్తున్న దాతగా పేరు పొందిన వ్యక్తి అనీ, వారు స్వర్ణోత్సవ కార్యక్రమాలకు తమ విరాళం ప్రకటించి అందజేస్తారని మురళీకృష్ణ సభలో ప్రకటించేడు.

ధనంజయరావు తనను సన్మానించినందుకు ధన్యవాదాలు తెలియజేసి తన వంతు విరాళం "వెయ్యిన్నూటాపదహార్లు" అని ప్రకటించి చెక్‌ను కార్యదర్శి మురళీకృష్ణకు హుందాగా అందజేసేడు.

మురళీకృష్ణ ముఖం సంతోషంతో విప్పారింది. తన ఫేస్ వాల్యూతో సాధించిన

ఘనకార్యంగా భావించి చెక్ అందుకుని మరొకమారు ధనంజయరావును పొగిడేడు. సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపేడు.

మర్నాడుదయం చెక్ బేంక్‌లో ప్రజంట్ చెయ్యబోయి చూసేడు.

ధనంజయరావు సభలో ప్రకటించి ఇచ్చిన డొనేషన్ "వెయ్యిన్నూటపదహార్లూ' రూపాయలు కాదని అవి కేవలం పైసలు మాత్రమే అని తెల్సుకుని నిర్ఘాంతపోయేడు ఫేస్‌వాల్యూ మురళీకృష్ణ.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 9-3-1998) ✪